నేరాల నియంత్రణకు పోలీసులు కృషి చేయాలి

వరంగల్ సీపీ అంబర్ కిశోర్‌ఝూ

రికార్డులను పరిశీలిస్తున్న అంబర్ కిశోర్‌ఝూ

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 18 : నేరాల నియంత్రణకు పోలీసులు మరింతగా కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్ ఘన్‌పూర్‌లోని ఏసీపీ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీకి పోలీస్ అధికారులు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఏసీపీ కార్యాలయ పరిధిలోని నేరాలపై ఆరా తీశారు. గ్రేవ్ కేసుల్లో నిందితుల అరెస్టు, దర్యాప్తు జరుగుతున్న తీరును ఏసీపీ భీమ్‌శర్మను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించమన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌తో పాటు, బ్యాంకులు, ఇతర ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ వచ్చే ఫిర్యాదుల పరిశీలించి నిజాయితీతో పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీలు మన్నన్ భట్, భీమ్‌శర్మ, స్టేషన్ ఘన్‌పూర్, రఘునాథపల్లి సీఐలు జీ వేణు, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు వినయ్‌కుమార్, రమేశ్, నవీన్‌కుమార్, నరేశ్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రమోషన్ పొందిన కానిస్టేబుల్‌కు సీపీ అభినందన

28 ఏళ్ల అనంతరం కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ పొందిన మల్లెపాక బాబును వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝూ అభినందించారు. డివిజన్ కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో రైటర్‌గా పని చేస్తున్న కానిస్టేబుల్ మల్లెపాక బాబుకు హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ లభించింది. హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ రావడం సంతోషంగా ఉందని బాబు తెలిపారు.

మృతురాలి కుటుంబానికి పలువురి చేయూత

నర్మెట, డిసెంబర్ 18: మండలంలోని ఆగాపేటకు చెందిన నిరుపేద గోరంతల పుష్ప(50) అనారోగ్యంతో మృతిచెందింది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు విరాళాలు సేకరించి దహన సంస్కారాలు నిర్వహించారు. మరోవైపు బీఆర్ఎస్ నర్మెట, తరిగొప్పుల మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. మాజీ సర్పంచ్ ముప్పిడి లక్ష్మీ విజయప్రతాప్ 50 కిలోల బియ్యం, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మేడబోయిన రాజు రూ.1000 సాయంగా అందజేశారు. ఆరు నెలల క్రితం తండ్రిని కోల్పోయిన చిన్నారులకు తల్లి పుష్ప సైతం అనారోగ్యంతో మృతిచెందడంతో కూతురు, కుమారుడు అనాథలుగా మిగిలారని స్థానికులు తెలిపారు. బాధిత కుటుంబానికి దాతలు చేయూతనందించాలని వారు కోరారు.

జవాబు ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియపర్చునది ఏమనగా. నా క్లయింటు అగు సట్ల ఆశోక్, తండ్రి: కీ.శే. సట్ల సోమయ్య, వయస్సు: 49 సం.లు, వృత్తి: గీత కార్మికుడు, నివాసము: ఇంటి నెం. 2-88, తాటికొండ గ్రామము, ఘన్‌పూర్ (స్టే) మండలము, జనగామ జిల్లా గారి కోరిక మేరకు ఈ జవాబు ప్రకటన జారీచేయనైనది. తేది: 03-12-2024 తేదిన నమస్తే తెలంగాణ తెలుగు దినపత్రికలో శ్రీ సట్ల వెంకటేశ్వర్లు తండ్రి: సట్ల సోమయ్య గారు శ్రీ చాట్ల నర్సింగరావు, అడ్వకేట్, జనగామ గారి ద్వారా బహిరంగ ప్రకటన జారీచేసినారు. ఇట్టి బహిరంగ ప్రకటనను నా క్లయింటు అగు సట్ల ఆశోక్ గారి కోరిక మేరకు ఈ జవాబు ప్రకటన జారీచేయడమైనది. తేది: 03-12-2024 తేదిన సట్ల వెంకటేశ్వర్లు గారి ద్వారా జారీచేయబడిన ప్రకటనలోని విషయాలు పూర్తిగా అవాస్తవాలు మరియు అబద్ధాలు. తాటికొండ గ్రామములో గల ఇంటి నెం. 2-88 గల నెంబరును తప్పుడు ఇంటి నెంబరు 2-8 గా ఇచ్చినాడు. ఇట్టి ఇంటికి నా క్లాయింటు పూర్తిగా హక్కుదారుడు. ఇట్టి ఇంటిపై సట్ల వెంకటేశ్వర్లు గారికి ఎట్టి హక్కులు లేవు. ఇట్టి ఇల్లు ఉమ్మడి ఆస్తి అనే విషయము పూర్తిగా అవాస్తవము. శ్రీ సట్ల వెంకటేశ్వర్లు గారు ఇట్టి ఇంటిలో తన యొక్క భాగస్వామ్య హక్కును తేది: 14-05-1993 తేదినాడు నాయొక్క క్లయింటుకు గ్రామములోని సాక్షుల ఎదుట విక్రయించి విక్రయదస్తావేజును కూడా నా క్లయింటుకు వ్రాసి ఇవ్వడం జరిగినది. తేది: 14-05-1993 నుండి నా క్లయింటు ఇంటి నెం. 2-88 కు పూర్తి హక్కుదారుడు, ఖబ్జాదారుడు. సట్ల వెంకటేశ్వర్లు దురుద్దేశ్యముతో మోసపూరితంగా నా క్లయింటుకు నష్టము కలుగచేయవలెననే ఉద్దేశ్యముతో వాస్తవాలను కప్పిపుచ్చి తప్పుడు బహిరంగ ప్రకటనను జారీచేసి నా క్లయింటు పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించవలెనని ప్రయత్నించుచున్నాడని ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి ఇట్టి జవాబు ప్రకటన ద్వారా తెలియపర్చునైనది. ఇట్టి ఇంటికి హద్దులు: తూర్పు: బోయిని ఎల్లయ్య గారి ఇల్లు, పడమర: చొక్కం రాజేందర్ గారి ఇల్లు, ఉత్తరం: గ్రామపంచాయితి రోడ్డు, దక్షిణం: గోషికొండ రాజేందర్ మరియు యం.డి. అక్రమ్ గారి ఇండ్లు.

సం/- **వీరమల్ల వెంకటేశ్వర్‌రావు,** అడ్వకేట్,
ఇ.నెం. 1-7-847/జిఎఫ్/2, హంటర్ రోడ్డు,
హనుమకొండ. సెల్: 9849270604

ఇసుక ట్రాక్టర్ సీజ్

చిల్పూరు,డిసెంబర్ 18: మండలంలోని చిన్నపెండ్యాల శివారు ఆకేరు వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నపెండ్యాలకు చెందిన చుక్క రాకేశ్ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండడంతో సీజ్ చేశామని తెలిపారు.

పటిక, బెల్లం వ్యాపారి బైండోవర్

కొడకండ్ల, డిసెంబర్ 18 : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నల్లబెల్లం, పటిక వ్యాపారం చేస్తున్న సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన సోమ రమేశ్‌ను బుధవారం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పద్మ అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని స్థానిక తహసీల్దార్ చంద్రమోహన్ ఎదుట హాజరుపర్చి బైండోవర్ చేశారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల రిలేదీక్షలు

- జిల్లా కేంద్రంలో తొమ్మిదో రోజుకు చేరిన ఆందోళన
- ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని వక్తల డిమాండ్

కలెక్టరేట్ వద్ద టీ స్టాల్‌తో నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 18 : సమగ్ర శిక్షా ఉద్యోగులను (ఎస్ఎస్ఏ) రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు తొమ్మిదో రోజుకు చేరాయి. బుధవారం దీక్ష శిబిరం వద్ద టీ స్టాల్ ఏర్పాటు చేసి వినూత్న రీతిలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులను వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్ఎస్ఏ ఉద్యోగులతో కలిసి సెక్రెటేరియట్‌లో చాయ్ తాగేలోపు రెగ్యులరైజ్‌కు జీవో జారీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. లేకుంటే తమకు టీస్టాల్ పెట్టుకోవడమే గత్యంతరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఉద్యోగ భద్రత, పేస్కేల్ వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరి రమేశ్, ప్రధాన కార్యదర్శి బైరగోని దయాకర్ గౌడ్, కోశాధికారి గోలి రవీందర్‌రెడ్డి, గోరంట్ల యాదగిరి, ఎండభట్ల శ్రీనివాస్, రాజ్ కుమార్, రొయ్యల రాజు, తరేశ్, కిషన్, మధు, అన్నపూర్ణ, రాధిక, మహాలక్ష్మి, సునీత, రాణి పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు సంఘీభావం

స్టేషన్ ఘన్‌పూర్ : తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించి, వారిని పర్మినెంట్ చేయాలని బీఆర్ఎస్వీ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి లకావత్ చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. చిరంజీవి మాట్లాడుతూ శ్రమదోపిడీకి గురవుతున్న సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, హెల్త్ కార్డులు, ఆరోగ్య బీమా, జీవిత బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మరణించిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందజేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పార్ట్ టైం ఉద్యోగులను ఫుల్ టైం ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెతో కేజీబీవీ, పాఠశాలల్లో చదువులు కొనసాగడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల నిరవధిక సమ్మె విరమించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కుట్టుమిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ చౌరస్తా, డిసెంబర్ 18 : ఇందిరా మహిళా శక్తి పథకం కింద జిల్లాలోని మైనార్టీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తున్నందున శిక్షణ పొందిన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి బీ రవీందర్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో నిరుద్యోగులైన మైనార్టీ మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నదని పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5.30 గంటలలోపు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఐడీ tgobmms.cgg.gov.in లో సమర్పించిన దరఖాస్తులను జిల్లా కలెక్టరేట్‌లోని ఫస్ట్ ఫ్లోర్‌లోని మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు సెల్ నంబర్ 9059679 793, 9346951278లో సంప్రదించాలని కోరారు.

చిరు వ్యాపారులపై అధికారుల వేధింపులను అరికట్టాలి

కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న చిరు వ్యాపారులు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 18 : రోడ్లపై చిరువ్యాపారులను పోలీసులు, మున్సిపల్ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నందున చర్యలు పలువురు డిమాండ్ చేశారు. దీనిపై బుధవారం కలెక్టరేట్ ఎదుట పండ్లు, కూరగాయలు, కొబ్బరి బోండాలు, సోడా బండ్లు నిర్వహించే వారు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిరువ్యాపారులు మాట్లాడుతూ రోడ్లపై వ్యాపారం చేసుకునే వారిని పోలీసులు, మున్సిపల్ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. స్థానిక నెహ్రూపార్కు నుంచి బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా వరకు హకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని కోరారు. తోపుడు బండ్లు, చిరువ్యాపారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. వెండర్ గుర్తింపు కార్డులు కలిగిన చిరు వ్యాపారులకు రూ.లక్ష చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిరువ్యాపారులు మెండి రమేశ్, అంగిడి మహేందర్, పిట్టల శివ, కోటి, బషీర్, గౌస్, నిర్మల, భాగ్య, కవిత, సోమలక్ష్మి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి

పాలకుర్తిలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకన్న

స్టేషన్ ఘన్‌పూర్/బచ్చన్నపేట/పాలకుర్తి, డిసెంబర్ 18 : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలపై మండల కేంద్రంలో బుధవారం సర్వే నిర్వహించారు. నిర్లక్ష్యానికి ఆస్కారం లేకుండా యాప్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి లింగయ్య, బిల్ కలెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. మరోవైపు బచ్చన్నపేట మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులకు సంబంధించి వివరాలు సేకరించారు. ప్రతిరోజూ 50 ఇండ్ల వరకు సర్వే చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జీపీ కార్యదర్శులు ఉదయం సర్వే చేసి యాప్‌లో దరఖాస్తుదారుల వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఉదయం 10 గంటల తర్వాత నెట్‌వర్క్ సమస్య తలెత్తుతుండడంతో సర్వే ముందుకు సాగడం లేదని పలువురు తెలిపారు. మరోవైపు పాలకుర్తిలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి వెంకటాచారి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు వస్తాయన్నారు. ఆయన వెంట తహసీల్దార్ పీ శ్రీనివాస్, ఎంపీడీవో ఆవుల రాములు, ఆర్ఐ రాకేశ్ ఉన్నారు.

మల్లన్న గుడికి రూ.50 వేలు విరాళం

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 18 : మండలంలోని తాటికొండ గ్రామంలో ఎడమ యాదవ సంఘం మల్లన్న గుడి నిర్మాణానికి మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి రూ. 50 వేలు ఆర్థిక సాయం చేశారు. బుధవారం యాదవ సంఘం సభ్యులు చల్లా సుధీర్ రెడ్డిని కలిసి గుడి నిర్మాణాన్ని గుర్తు చేయగా సాయం అందించారు. ఎడమ కట్టుమల్లు, బర్మా మల్లేశం, మాజీ ఉప సర్పంచ్ మారపాక రాములు, ఎడమ గట్టయ్య, ఎడమ బుచ్చి కొమురయ్య, మేకల సమ్మయ్య, మారపాక సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం ఇస్తున్న సుధీర్‌రెడ్డి

సంక్షేమ పథకాలు అందించాలి

బాలరాజు

బచ్చన్నపేట, డిసెంబర్ 18 : ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను పద్మశాలీలకు వర్తింప చేయాలని పద్మశాలీ సంఘం సహాయ కార్యదర్శి గుర్రపు బాలరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పద్మశాలీలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటు అందించాలన్నారు. బచ్చన్నపేటలో వెయ్యికి పైగా పద్మశాలీ కుటుంబాలు చేనేత వృత్తిపైనే ఆధారపడి ఉన్నాయని బాలరాజు తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర స్థాయిలో పదవి అప్పగించినందుకు రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

చిల్పూరు, డిసెంబర్ 18 : మండలంలోని వెంకటేశ్వరపల్లిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీపతిపల్లికి చెందిన బత్తిని చంద్రమౌళికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రమౌళి దంపతులు బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి బైక్‌పై వస్తుండగా చిల్పూరు సమీపంలో బొలెరో వాహనం ఢీకొంది. దీంతో చంద్రమౌళి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు 108 వాహనంలో ఈఎంటీ రాజేంద్రప్రసాద్, పైలేట్ అమర్‌నాథ్ తరలించారు.

దేవరుప్పుల, నర్మెటలో తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇస్తున్న జీపీ ఉద్యోగులు, కార్మికులు

జీపీ కార్మికుల ముందస్తు అరెస్టు అప్రజాస్వామికం

దేవరుప్పుల, డిసెంబర్ 18: గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికులు హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మంగళవారం చేపట్టిన ఆందోళనను విఫలం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడిందని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న అన్నారు. జీపీ ఉద్యోగులు, కార్మికుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ బుధవారం స్థానిక తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీవో లక్ష్మీనారాయణకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడు తూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నిక మ్యానిఫెస్టోలో జీపీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేస్తామని చెప్పిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక మల్టీపర్పస్ విధానం రద్దు చేసి, అర్హులకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఆరోగ్య బీమా అమలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బస్వరాంచందర్, నాయకులు ఎడెల్లి వెంకట్‌రెడ్డి, ఉత్తెపు ఐలయ్య, మాచర్ల భిక్షపతి, మడికొండ నర్సింహ, రమణ, లావణ్య, జయమ్మ, సంజీవ పాల్గొన్నారు.

నర్మెటలో..

నర్మెట : గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అరవింద్‌కు జీపీ కార్మికులు వినతిపత్రం అందించారు. తమ సమస్యలపై చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టగా పోలీసులు పలుచోట్ల ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారని వారు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ సిబ్బంది చిర్ర వెంకట్‌రెడ్డి, సిద్ధులు, సోని, మల్లయ్య, రాజ మణి, యాకమ్మ, అంజనేయులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

స్టేషన్ ఘన్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 18 : సీపీఎం జిల్లా మహాసభలను ఈనెల 27, 28 తేదీల్లో డివిజన్ కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి కోరారు. బుధవారం డివిజన్ కేంద్రం లో కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి మహాసభలపై ప్రచారం నిర్వహించారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి నేటి వరకు పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నదని కమ్యూనిస్టులేనని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం మొదటి నుంచి పోరాటం చేస్తున్నదని కనకారెడ్డి వివరించారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, పేదలందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఇల్లు లేని ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, రాపర్తి సోమయ్య, బొట్ల శేఖర్, మండల కార్యదర్శి మునిగెల రమేశ్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, కోడెపాక యాకయ్య, సుంచు విజేందర్, పొదల నాగరాజు, పల్లేరుల లలిత, కళ్యాణి, దాసరి సుమ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ఛాగల్ స్కూల్‌లో జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు ప్రారంభం

క్రీడాకారులతో కబడ్డీ పోగుల సారంగపాణి

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 18 : మండలంలోని ఛాగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి ప్రోకబడ్డీ ఎంపిక పోటీలను కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ పోగుల సారంగపాణి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ వరకు బాలికల జట్టు ఎంపిక పోటీలు, 21 నుంచి 26 వరకు బాలుర జట్టు ఎంపిక పోటీలను నిర్వహిస్తామన్నారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతారని ఆయన పేర్కొన్నారు. ఎంఈవో కొమురయ్య, అసోసియేషన్ జిల్లా బాధ్యులు వై కుమార్ గౌడ్, పోగుల నరేందర్ గౌడ్, తోటకూరి గట్టయ్య, వెంకటేశ్వర్లు, గద్దె అనిల్‌కుమార్ గౌడ్, ఇంజపూరి హరీశ్ పాల్గొన్నారు.

ఎస్సై శ్రీదేవిని సన్మానిస్తున్న యూత్ సభ్యులు

తరిగొప్పుల ఎస్సైకి సన్మానం

తరిగొప్పుల, డిసెంబర్ 18 : తరిగొప్పుల ఎస్సై శ్రీదేవిని బుధవారం యూనిక్ యూత్ సభ్యులు సన్మానించారు. ఇటీవల ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శ్రీదేవి మండల ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని వారు కోరారు. యూత్ అధ్యక్షుడు మంచినీళ్ల రాకేశ్, ఉపాధ్యక్షుడు పురమని రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ బండ మధు, సోషల్ మీడియా బాధ్యులు తాటి రజనీకాంత్, నితీష్, రవితేజ, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

తరిగొప్పుల, డిసెంబర్ 18 : ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను తుంగలో తొక్కిందని బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం నాయకులు చెవిటి అర్జున్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞత సభలు పెట్టడం సిగ్గు చేటన్నారు. ఆయన వెంట రామకృష్ణ తదితరులు ఉన్నారు.

మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

29న రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర మహాసభలు

లింగాలఘనపురం, డిసెంబర్ 18 : తెలంగాణ రజక రిజ్వరేషన్ సమితి రాష్ట్ర మూడో మహాసభలను ఈ నెల 29న జనగామలో నిర్వహిస్తున్న ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏదునూరి వీరన్న అన్నారు. మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం మండల కేంద్రంలోని వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ సమాజంలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా మండలంలోని రజకులంతా మహాసభకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు ఏదునూరి నరేశ్, కొలిపాక రాములు, ఏదునూరి పద్మ, ఉపేందర్, చెన్నూరి మల్లేశం, లింగరాజు, నరసింహులు, నాగరాజు, బాలయ్య, దేవరకొండ శంకరయ్య పాల్గొన్నారు.

ఘనంగా జిల్లా స్థాయి జీవశాస్త్రం టాలెంట్ టెస్ట్

జనగామ చౌరస్తా, డిసెంబర్ 18 : తెలంగాణ జీవశాస్త్ర ఫోరం (టీబీఎస్ఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జనగామ పట్టణంలో విద్యార్థులకు జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ముఖ్య అతిథి జిల్లా సైన్స్ అధికారి సీహెచ్ ఉపేందర్, విశిష్ట అతిథిగా హాజరైన అకాడమిక్ మానిటరింగ్ అధికారి బీ శ్రీనివాస్ మాట్లాడారు. నిత్యజీవితంలో మానవులకు అనేక అవసరాలను జీవశాస్త్రం తీరుస్తుందని తెలిపారు. సూక్ష్మజీవ నాశకాలు, టీకాలు, ఇతర ఔషదాల తయారీని తెలియజేస్తుందని పేర్కొన్నారు. జీవరాశుల శరీర, అవయవ నిర్మాణాలతో పాటు వాటి విధులు తెలుసుకోవచ్చన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా ఆహార ఉత్పత్తులను పెంచడానికి జీవశాస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ నెల 28న రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్ పోటీలకు వీరిని పంపిస్తామని తెలిపారు. ఈ